# రేషనలైజేషన్‌పై విద్యాశాఖ కసరత్తు

విద్యాశాఖకు 30 లోగా రేషనలైజేషన్ చేసి జూన్ 10కి బదిలీలు పూర్తి చేయాలని భావిస్తోంది. ఇది ఎంత సాధ్యమో చూడాలి. ఇందుకోసం పెద్ద ఎత్తున రేషనలైజేషన్ చేయాలని కసరత్తు ప్రారంభించింది. త్వరలో మార్గదర్శకాలు వచ్చే అవకాశం వుంది. వీటికి ప్రభుత్వ ఆమోదం, ముఖ్యమంత్రి ఆమోదం కావల్సి వుంది.

మనం విద్యారంగాన్ని గ్రామ స్థాయిలో పాఠశాల వ్యవస్థను పటిష్టీకరించే ప్రయత్నంలో భాగంగానే రేషనలైజేషన్ జరగాలని కోరుతున్నాము. స్కూళ్ళను మూసేసి, టీచర్లను సర్దుబాటు చేయడం మాత్రమే రేషనలైజేషన్ కాకూడదంటున్నాము.

దీనికోసం మొదట పంచాయతికి ఒకటి, జనాభాను బట్టి అదనంగా కామన్ స్కూళ్ళు గుర్తించాలని వాటికి అన్ని హంగులు ఏర్పరచి స్వచ్ఛందంగా ఆ పాఠశాలలోకి మిగిలిన స్కూళ్ళ పిల్లలు వెళ్ళేలోగా రేషనలైజేషన్ వుండాలంటున్నాము. దీన్ని పి.డి.ఎఫ్. పక్షాన వి.బి.ఎస్.గారు చాలాకాలంగా చెపుతున్నారు. ఫ్యాప్టో కూడా ఇదే అభిప్రాయంతో వుంది. (దీనిపై వి.బి.ఎస్.గారి పత్రాన్ని జతపరుస్తున్నాము).

**ప్రభుత్వ తాజా ప్రతిపాదనలు (ప్రాథమిక పాఠశాలలు) :**

1) తరగతికి ఒక గది, ఒక టీచరు, బాల్యారంభ కేంద్రం, 5 మంది టీచర్లలో ఒకరు ఇంగ్లీషు ఉపాధ్యాయుడు, 150 మందికి మించితే హెడ్‌మాస్టరు పోస్ట్ వుండాలి. దీన్ని పంచాయతీ యూనిట్‌గా, ఎక్కువ స్థలం అందుబాటు, ప్రస్తుత వసతులు ఆధారంగా గుర్తించాలి. ఇది యు.పి. స్కూలు కూడా కావచ్చు. దీనికి కామన్ స్కూలు అని నామకరణం.

2) 1 కిమీ పరిధి చొప్పున వున్న 30 లోపు పిల్లలు గల ప్రాథమిక పాఠశాలల్ని ఇందులో విలీనం చేయాలి. 10 లోపు పిల్లలుంటే 1 కిమీ కంటే ఎక్కువ దూరంలో వున్న పాఠశాలల్ని కూడా దీనిలో విలీనం చేయాలి. పిల్లల సంఖ్యకు ఆధార్ లెక్కలు ప్రాతిపదిక, DISE కాదు.

3) కన్నడం, తమిళం, ఉర్దూ లాంటి మైనారిటీ భాషల పాఠశాలలకు, రైల్వే లైను, హైవే దాటవలసిన వాటికి, ప్రిమిటివ్ గిరిజనుల స్కూళ్ళకు మినహాయింపు వుంటుంది.

4) విలీనం అయ్యే స్కూళ్ళ సంఖ్య ఇంకా పూర్తిగా తేలలేదు. 7000–8000 వుండొచ్చునని ఒక అంచనా. ఇంకా తగ్గవచ్చు.

**యు.పి. స్కూళ్ళు :**

1) ప్రతి యు.పి. స్కూలుకు 8 తరగతి గదులు, 5 మంది ప్రాథమిక తరగతులకు, 6,7,8 తరగతులకు తెలుగూ, హిందీ, ఇంగ్లీషు, సామాన్య శాస్త్రం, గణితం స్కూలు అసిస్టెంట్లు వుండాలి. అన్ని యు.పి. స్కూళ్ళు 8వ తరగతి వరకు ఉండాలి.

2) ఇది కామన్ (ప్రాథమిక) స్కూలు కూడా కావచ్చు.

3) మైనర్ మీడియా వుంటే సమాంతరంగా వుండాలి.

4) తరగతికి 20 వంతున 6, 7, 8 తరగతులకు పిల్లలు తక్కువైతే, 3 కి.మీ. లోపున మరో యు.పి. లేదా హైస్కూలు వున్నట్లయితే వాటిని విలీనం చెయ్యాలి. విలీనం హైస్కూల్లో కూడా చెయ్యవచ్చు.

**ఉన్నత పాఠశాలలు :**

1) 5 కి.మీ. లోపున వున్న 75 మంది పిల్లలకు తక్కువగా గల ఉన్నత పాఠశాలల్ని యు.పి. స్కూళ్ళుగా స్థాయి తగ్గించాలి.

2) ఇంగ్లీషు మీడియంలో 75కు తక్కువున్న సమాంతర సెక్షన్లను కూడా విలీనం చెయ్యాలి.

3) పిల్లల సంఖ్యకు అనుగుణంగా కొత్త స్టాఫ్ ప్యాటర్న్ రూపొందించాలి.

4) సక్సెస్ పాఠశాలల్లో 100కు మించి ఇంగ్లీషు మీడియం గల (1682) ఉన్నత పాఠశాలల్లో ఈ మీడియం బోధనకు ప్రత్యేక ఏర్పాటు (మొదట) చెయ్యాలి. 3 కి.మీ. లోపున ఉన్న రెండు సక్సెస్ పాఠశాలల్లో కేవలం ఇంగ్లీషు మీడియం మాత్రమే వుంటే స్కూళ్ళుగా కొన్నిటిని మార్చాలి. ఇంగ్లీషు మీడియం టీచర్లను ప్రత్యేకంగా ఆప్షన్ ప్రకారం గుర్తించాలి. (దీనికై వి.బి.ఎస్.గారి పత్రాన్ని జతపరుస్తున్నాము).

**అదనపు పోస్టులు :**

దీనివల్ల ఎన్ని అదనపు పోస్టులు తేలుతాయో, ఎన్ని కొత్త పోస్టులు వస్తాయో లెక్క తేలాల్సి వుంది. అదనపు పోస్టుల్ని విద్యా శాఖ పటిష్టీకరణకు కొత్త పోస్టులుగా మార్చుకోవాలి. ఉదా: అదనపు డిప్యూటి డి.ఇ.వో.లు, అకడమిక్ యం.ఇ.వో., డైట్, ఎస్.సి.ఇ.ఆర్.టి.లకు పోస్టులు, నాన్‌టీచింగు పోస్టులు వగైరా.

**బదిలీలు :**

రేషనలైజేషన్ తర్వాతనే బదిలీలు, గత మార్గదర్శకాలే వుండొచ్చు.

- 2013లో బదిలీ అయి రిలీవు కాని వారిని రిలీవు చేసేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న జడ్.పి. టీచర్లను జడ్.పి. స్కూళ్ళకు పంపడానికి, అంతర్ జిల్లా బదిలీలకు అంగీకరించారు. జోనల్ పోస్టుగా వున్నపుడు ఇతర జిల్లాలకు బదిలీ అయిన హెడ్‌మాస్టర్లకు, యం.ఇ.వో.లకు కూడా స్వస్థలాలకు వెళ్ళే అవకాశం కోసం వి.బి.ఎస్. ప్రాతినిధ్యం చేశారు.